

ఆ నలుగురు

తొలిసారి అసెంబ్లీకి

రెండో ప్రయత్నంలో గెలుపొందిన భానుప్రకాష్

తొలిసారే విజయం సాధించిన గురజాల, థామస్, మురళి

కుప్పం నుంచి చంద్రబాబు ఎనిమిదోసారి

పలమనేరులో అమర్‌కు మూడో గెలుపు

పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి నాలుగోసారి

జిల్లా నుంచి ఈసారి నలుగురు ఎమ్మెల్యేలు తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. నగరి గాలి భానుప్రకాష్, చిత్తూరు గురజాల జగన్మోహన్, జీడీనెల్లూరు థామస్, పూతలపట్టు మురళీమోహన్ తొలిసారి ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. కుప్పం నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు 8వసారి, పలమనేరు నుంచి మాజీ మంత్రి అమర్ మూడోసారి, పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి నాలుగోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు. ఈ ముగ్గురు గతంలోనూ వేరే నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయం తెలిసిందే.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



నగరి నుంచి రెండో ప్రయత్నం




గతంలో పుత్తూరు, నగరి రెండు నియోజకవర్గాలుగా ఉండేవి. 2009లో పునర్విభజన తర్వాత పుత్తూరు అంతరించి పోయి, నగరి మాత్రమే మిగిలింది. పుత్తూరు నుంచి ఐదు సార్లు గెలిచిన దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు.. నగరి నుంచి 2009లో పోటీ చేసి ఆరోసారి గెలిచారు. ఆ తర్వాత 2014లో గాలి ముద్దుకృష్ణమనాయుడిపై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్కే. రోజా స్వల్ప ఓట్ల తేడాతో గెలుపొందారు. 2018లో గాలి ముద్దుకృష్ణమనాయుడు మరణించడంతో టీడీపీ అధిష్ఠానం ఆయన పెద్దకుమారుడు భానుప్రకాష్‌కు అవకాశం ఇచ్చింది. 2019లో నగరి నుంచి పోటీ చేసిన ఆయన రోజాపై స్వల్ప ఓట్ల ఆధిక్యతతో ఓటమి పొందారు. ఆ ఎన్నికల్లో వైసీపీ గాలి తీవ్రంగా ఉన్నా రోజా స్వల్ప ఓట్ల తేడాతోనే గెలవడం గమనార్హం. తాజా ఎన్నికల్లో రెండోసారి పోటీ చేసిన గాలి భాను అత్యధిక మెజార్టీతో గెలిచి, రోజాను చిత్తుగా ఓడించారు. అలా భానుప్రకాష్ రెండో ప్రయత్నంలో గెలిచి.. తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు.

తక్కువ సమయంలోనే తొలి విజయం



చిత్తూరు నుంచి గెలిచిన గురజాల జగన్మోహన్ తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని ఈయన చిత్తూరులో సేవా కార్యక్రమాలు చేసి తక్కువ సమయంలోనే క్లిక్ అయ్యారు. టీడీపీ అధిష్ఠానం జరిపిన సర్వేలో గెలుపు విషయంలో ఇతడి పేరు ముందుండటంతో చంద్రబాబు అవకాశమిచ్చారు. చిత్తూరును ఒకప్పుడు ఏలిన రాజకీయ కుటుంబాలు గురజాల వెంట నడవడం, శ్రేణులు సమష్టిగా పనిచేయడంతో గురజాల విజయం సాధించారు. వైసీపీ వచ్చినప్పటి నుంచీ చిత్తూరులోనే ఉన్న విజయానందరెడ్డిని నియోజకవర్గ ప్రజలు తిరస్కరించారు.

అనేకమార్లు పోటీ చేసిన ఈ ముగ్గురు



● ఇక టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం నుంచి ఎనిమిదోసారి పోటీ చేసి ఘనమైన మెజార్టీతో గెలుపొందారు. ఆయన 1989లో తొలిసారి పోటీ చేయగా.. వరుసగా అన్ని ఎన్నికల్లోనూ గెలుస్తూ వస్తున్నారు. చంద్రబాబు కుప్పం రాకముందు సొంత నియోజకవర్గం చంద్రగిరిలో 1978లో తొలిసారి పోటీ చేసి గెలిచిన విషయం తెలిసిందే. 1983లో టీడీపీ ఎన్టీఆర్ గాలిలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన చంద్రబాబు ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కుప్పం నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు.



● అంతకుముందు ఎస్సీ రిజర్వుడు అయిన పలమనేరు నియోజకవర్గం 2009లో జరిగిన పునర్విభజన తర్వాత జనరల్ అయింది. అప్పటి నుంచి నాలుగు సార్లు ఎన్నికలు జరగ్గా.. 2019 తప్ప మిగిలిన మూడు సార్లూ అమరనాథరెడ్డి గెలుపొందారు. నియోజకవర్గాల విభజనకు ముందు ఆయన పుంగనూరు నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే.



● పీలేరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలిచిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2009లో జరిగిన పునర్విభజన తర్వాత పుంగనూరుకు వచ్చారు. ఇక్కడ నాలుగుసార్లు వరుసగా గెలిచారు. మొత్తంగా ఆయన ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

తొలిసారే ఘన విజయం



వేపంజేరి నియోజకవర్గం నుంచి 2009లో జీడీనెల్లూరు ఏర్పడింది. అప్పటి నుంచీ ఇక్కడ టీడీపీ జెండా ఎగరలేదు. 2009లో కాంగ్రెస్, 2014, 2019లో వైసీపీ గెలిచింది. ఈసారి ఎలాగైనా జీడీనెల్లూరులో జెండా ఎగరేయాలనే ఉద్దేశంతో ఫెర్టిలిటీ విభాగంలో నిపుణుడైన డాక్టర్ థామస్‌ను టీడీపీ అధిష్ఠానం గతేడాది జూన్‌లో రంగంలోకి దింపింది. అప్పటి నుంచీ ఆయన నియోజకవర్గంలో పార్టీని పటిష్ఠపరిచి వైసీపీ సీనియర్ లీడర్ నారాయణస్వామిని గట్టిగా ఎదుర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలతో పాటు సొంత పార్టీ నాయకుల్లో ఉన్న వ్యతిరేకత కారణంగా ఎన్నికలకు ముందే జీడీనెల్లూరులో థామస్ గెలుస్తున్నారనే సంకేతం జనాల్లోకి వెళ్లిపోయింది. తాజా ఎన్నికల్లో థామస్ మంచి మెజార్టీతో గెలిచి తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు.

ఎలాంటి నేపథ్యం లేకున్నా..

పూతలపట్టు నియోజకవర్గం 2009లో కొత్తగా ఏర్పడింది. అప్పటి నుంచీ ఇక్కడ టీడీపీ గెలవలేదు. 2009లో కాంగ్రెస్, 2014, 2019లో వైసీపీ గెలిచింది. 2009, 2014 ఎన్నికల్లో సగటున వెయ్యి ఓట్ల తేడాతోనే టీడీపీ ఓడిపోయింది. ఏమాత్రం రాజకీయ నేపథ్యం లేని, ఆర్థికంగా బలం లేని ఓ సామాన్యుడు, జర్నలిస్టును ఈసారి అభ్యర్థిగా టీడీపీ ఎంపిక చేసింది. మురళీమోహన్ ఇన్‌చార్జిగా నియమితులైనప్పటి నుంచీ నియోజకవర్గంలోని సీనియర్లను కలుపుకొని వెళ్లారు. వీరంతా ఆయన గెలుపుకోసం సమష్టిగా కృషి చేశారు. గతంలో ఇక్కడ ఓసారి ఎమ్మెల్యేగా పనిచేసిన సునీల్‌కుమార్ లోకల్‌గా పరిచయాలు, అనుభవం ఉన్నా.. ప్రజలు ఆదరించలేదు. మురళీమోహన్ తొలి ప్రయత్నంలోనే గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు.



ఇక దయచేయండి

నామినేటెడ్ కార్పొరేషన్ల చైర్మన్లకు ఉద్వాసన ఆదేశాలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7: 'మీ సేవలు చాలు.. ఇక దయ చేయండి' అంటూ వివిధ కార్పొరేషన్లకు ప్రభుత్వం నియమించిన సలహాదారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లను తొలగించాలంటూ నూతన రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోయింది. ఆ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పోస్టుల్లో నియమితులైన వారి చేత రాజీనామా చేయించాలని ఆయా శాఖలను ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాకు సంబంధించి ఒక సలహాదారుడు, 15 కార్పొరేషన్ల చైర్మన్లకు నేడో రేపో ఉద్వాసన ఆదేశాలు జారీ కానున్నాయి. అయితే, వీరిలో కొందరు ఇప్పటికే రాజీనామా చేసినట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తమ రాజీనామా పత్రాలను ఆయా అధికారులకు పంపారు. మొత్తమ్మీద జిల్లాలో ప్రభుత్వ సలహాదారుడు (ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలు), చిత్తూరు మాజీ ఎంపీ ఎం.జ్ఞానేంద్రరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సురేష్, ఈడిగ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శాంతి, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ ఎం.బీ. కుమార్‌రాజా, ఏపీఎంబీసీ చైర్‌పర్సన్ షమీమ్ అస్లాం, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, ఫోక్ క్రియేటివిటీ అకాడమీ చైర్మన్ కె. నాగభూషణం, ఏపీఎస్‌ఆర్టీసీ రీజనల్ బోర్డు వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ, సీడీసీఎంఎస్ చైర్మన్ ఎస్. నాగలక్ష్మి, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, ఐసీడీసీఎస్ రీజనల్ ఆర్గనైజర్ శైలజారెడ్డి, పి.కె.ఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి యాదవ్, చిత్తూరు జిల్లా కోఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ జి. మురళీమోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాబు, జిల్లా పరిషత్ స్త్రీ శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి మధుకుమార్ ఉన్నారు. అలాగే, 76 సింగిల్ విండోల త్రిసభ్య కమిటీలూ ఇంకా వైదొలగలేదు. ఇంకా రాజీనామా చేయని వారికి ఉద్వాసన పలకనున్నారు.

చిత్తూరు జిల్లా మాజీ కలెక్టర్లకు
కొత్త ప్రభుత్వంలో కీలక కొలువులు


నీరబ్‌కుమార్ ప్రసాద్


ముద్దాడ రవిచంద్ర

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7: గతలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్లుగా పనిచేసినవారిలో ఇద్దరు కూటమి ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉండబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి నీరబ్‌కుమార్ ప్రసాద్ 1998లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఈ బాధ్యతల్లో ఆయన ఉన్నది 9 నెలలే అయినా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్మభూమి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో ఆ సమయంలో కరువు తీవ్రంగా ఉంది. మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పనికి ఆహార పథకాన్ని ఆయన సమర్థంగా అమలు చేశారు. ఈయన 1987 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. చంద్రబాబు నాయుడు పాలనలో కీలక శాఖలకు ముఖ్య కార్యదర్శిగా ఆయన పనిచేశారు.

● ఇక 2008-09లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన ముద్దాడ రవిచంద్ర ఏపీ సీఎం ముఖ్య కార్యదర్శిగా సీఎంవోలో బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈయన 1996 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి.



కుప్పం రూరల్, జూన్ 7: కుప్పం మండలం గరిగచేనీపల్లెలో ఇళ్ల మధ్యలోకి శుక్రవారం కొండ చిలువ చొరబడింది. మూడు కోళ్లను మింగేసిన కొండ చిలువ, పక్కనే ఉన్న దూడలను కూడా తినడానికి చూసింది. దీనిని గమనించిన గ్రామస్తులు, భయంతో అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. సిబ్బంది వచ్చి కొండ చిలువను బంధించి అడవిలో వదిలిపెట్టారు.

కుప్పం రెస్కోలో సర్వీస్ రిజిస్టర్ మాయం

ఎస్టాబ్లిష్‌మెంట్ జేఏవో కృష్ణమూర్తికి మెమో

కుప్పం, జూన్ 7: కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో)లో సర్వీస్ రిజిస్టర్ ఒక రోజుపాటు మాయమైంది. దీనిపై విషయం బయటకు పొక్కగానే తిరిగి కార్యాలయంలో ప్రత్యక్షమైంది. దీనికి బాధ్యులైన ఎస్టాబ్లిష్‌మెంట్ జేఏవో ఎం.కృష్ణమూర్తికి ఎండీ ప్రభాకర్ మెమో జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం రెస్కోలో ఐదేళ్ల వైసీపీ పాలనలో చాలా అవకతవకలు చోటు చేసుకున్నాయని టీడీపీ ఆరోపిస్తోంది. ఎన్నికల ప్రచారాంశాల్లో దీనినీ చేర్చింది. అక్రమ నియామకాలు జరిగాయని, అందుకు లక్షల్లో ముడుపులు అధికారులకు, వైసీపీ నేతలకు ముట్టాయన్న ఆరోపణలు తీవ్రంగా చేసింది. ఎన్నికలు ముగిసి తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చింది. కౌంటింగ్ ముగిసిన మరుసటి రోజున ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, కుప్పం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కుప్పంలోని ప్రతి ప్రభుత్వ శాఖలో అవినీతి చోటు చేసుకుందని, విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే క్రమంలో కుప్పం రెస్కోలో జరిగిన అవినీతి, అక్రమ నియాకాలతోపాటు ఇతర అక్రమాలపై సీఐడీ విచారణ జరిపిస్తామని స్పష్టంగా చెప్పారు. ఆ మరుసటి రోజునే అంటే, 6వ తేదీ గురువారంనాడు కుప్పం రెస్కోలోని ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్ మాయమైనట్లు ప్రచారం జోరుగా జరిగింది. దీనిపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సీరియస్ అయినట్లు తెలిసింది. వెంటనే రెస్కో ఎండీ ప్రభాకర్‌కు ఆయన ఫోన్ చేసి తీవ్రస్థాయిలో మందలించినట్లు సమాచారం. రెస్కోలో అందరి జాతకాలు తనవద్ద ఉన్నాయని, వెంటనే సర్వీసు రిజిస్టర్ తిరిగి కార్యాలయానికి చేరకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో ఆందోళన చెందిన ఎండీ ప్రభాకర్.. సర్వీస్ రిజిస్టర్ గురించి విచారిస్తే ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్ జేఏవో ఎం.కృష్ణమూర్తి సర్వీస్ రిజిస్టర్ తెరచినట్లు, బయటకు కూడా తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీనిపై కృష్ణమూర్తికి ఎండీ ప్రభాకర్ శుక్రవారం మెమో జారీ చేశారు. పైన పేర్కొన్న పొరపాట్లకు సంబంధించి మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఆ అక్రమాలు సరిచేసేందుకేనా?

ఈ ఐదేళ్ల కాలంలో జరిగిన అక్రమ నియామకాలను సరిచేసేందుకే సర్వీసు రిజిస్టర్ మాయం చేశారని టీడీపీ అనుమానిస్తోంది. ప్రభుత్వం మారడం.. అక్రమ నియామకాలు, డబ్బుల వసూళ్లపై విచారణ జరిపిస్తామని టీడీపీ ప్రకటించడం.. దీనిపై ప్రాథమిక సాక్ష్యాధారలను సేకరించి పెట్టుకున్న క్రమంలో సర్వీస్ రిజిస్టర్ మాయమవడం గమనార్హం. ఉద్యోగుల సర్వీసును, అంటే వారు ఎంతకాలంగా ఏ హోదాలో సంస్థలో పనిచేస్తున్నారన్న విషయాన్ని నిర్ధారించేది సర్వీసు రిజిస్టర్. ఎన్నికల ముందు జరిగిన నియామకాలను కూడా చాలాకాలం కిందటే జరిగినట్లుగా, అందుకనే వారి నియామకాలు, పదోన్నతులతోపాటు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ సక్రమంగా జరిగాయని నిర్ధారించేందుకు తేదీలు మార్పు చేయడానికే దీనిని వెలుపలికి తీసుకెళ్లినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధ్యమైనంత త్వరలో రెస్కోలో విచారణ జరిపించి ఇన్నాళ్లుగా సంస్థలో జరిగిన అక్రమాలు, అవినీతి చర్యలన్నింటినీ బయట పెట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్న కృతనిశ్చయంతో టీడీపీ నేతలున్నారు.



జడ్పీ మాజీ సీఈవో అక్రమాలపై విచారణ చేపట్టండి

● జడ్పీ సీఈవోకు ఏపీ పీఆర్ ఉద్యోగ సంఘ నేతల వినతి



చిత్తూరు రూరల్, జూన్ 7: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పదేళ్లుగా జిల్లా పరిషత్‌లో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, దానిపై విచారణ చేపట్టాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ సీఈవో గ్లోరియాకు వినతిపత్రం అందజేశారు. జడ్పీలోని ఏవో స్థాయి నుంచి రికార్డ్ అసిస్టెంట్, అటెండర్ వరకు మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలోనూ ఇబ్బందులు పెట్టాడని ఆరోపించారు. ఆయన వేధింపుల కారణంగా జిల్లాలో పలువురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. జడ్పీ జనరల్ ఫండ్, 15 ఫైనాన్స్ ఫండ్, హౌసింగ్ అడ్వాన్స్, బీఆర్‌జీఎఫ్ ఫండ్స్, ఎస్‌జీఆర్‌వై గ్రాంట్స్, డీపీఆర్‌సీ ఫండ్స్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలెక్షన్ ఫండ్స్‌లోనూ అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఉద్యోగ సంఘ నాయకులు పీఎంఆర్ ప్రభాకర్, శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.



కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్‌గా విజయేంద్రరావు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 7: చిత్తూరు జిల్లా విద్యాశాఖలో ఇన్‌చార్జి డీఈవోగా పనిచేసి, ఏడీ-1గా కొనసాగుతున్న విజయేంద్రరావుకు రాష్ట్ర స్థాయి అధికారిగా పదోన్నతి లభించింది. సమగ్రశిక్షలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కాగా ఆయన స్థానంలో ఏడీ-2గా పనిచేస్తున్న వెంకటేష్‌కు ఏడీ-1 ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

31 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7: నైరుతి రుతుపవనాల ప్రభావంతో గురువారం ఉదయం 8 నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 31 మండలాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. విజయపురం మినహా మిగిలిన 31 మండలాల్లో భారీగా వర్షపాతం నమోదైంది. పాలసముద్రంలో రికార్డుస్థాయిలో 73.4 మి.మీ వర్షం కురిసింది. పలమనేరు 71.2, బైరెడ్డిపల్లి 67.6, గంగవరం 57.8, తవణంపల్లె 57.6, రామకుప్పం 38.2, వి.కోట 36.0, చిత్తూరు అర్బన్ 33.4, కుప్పం 29.0, పూతలపట్టు 28.6, చౌడేపల్లి 28.4, గుడుపల్లె 27.6, గంగాధరనెల్లూరు 27.2, ఐరాల 26.2, శాంతిపురం 26.2, వెదురుకుప్పం 24.2, చిత్తూరు రూరల్ 17.6, పెనుమూరు 16.6, పులిచెర్ల 15.0, బంగారుపాళ్యం 14.6, శ్రీరంగరాజపురం 13.2, యాదమరి 13.0, సోమల 12.6, పుంగనూరు 8.6, పెద్దపంజాణి 7.2, గుడిపాల 6.6, రొంపిచెర్ల 5.2, కార్వేటినగరం 4.2, సదుం 3.2, నగరి 2.6, నింద్రలో 1.2 మిమీ వర్షపాతం నమోదైంది.

అమాత్యులెవరు?

అందరిలోనూ ఆశలు

ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

మంత్రి పదవులపై సర్వత్రా చర్చ

చిత్తూరు ఎంపీకి కేంద్ర మంత్రిగా ఛాన్సు

రాష్ట్ర మంత్రి పదవి కోసం పలువురి యత్నాలు

రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో రేపు ప్రధానిగా నరేంద్ర మోదీ, అలాగే ఈనెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారాలు చేయనున్నారు. ఆయా తేదీల్లోనే కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు కూడా ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. లేదంటే కొన్ని రోజుల ఆలస్యం అయినా మొత్తం మీద ఈ నెలలోనే పూర్తిస్థాయి కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో జిల్లా నుంచీ ఎవరెవరికి మంత్రి పదవులు లభించే అవకాశముంది? ఏ ప్రాతిపదికన? అన్న అంశాలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. కూటమిలో ఏ పార్టీలో ఎవరికి? సామాజికవర్గాల రీత్యా అయితే ఎవరికి? కొత్త జిల్లాల ప్రకారమా లేక ఉమ్మడి జిల్లాల ప్రకారమా? అన్న ప్రశ్నలు అటు రాజకీయ వర్గాలతోపాటు జనంలోనూ వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ చర్చలతో నిమిత్తం లేకుండా జిల్లా నుంచీ పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.


దగ్గుమళ్ల ప్రసాదరావు


అమరనాథరెడ్డి

నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


తిరుపతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వర్గాల సమాచారం మేరకు కేంద్ర మంత్రివర్గంలో ఎస్సీ సామాజికవర్గం నుంచీ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేరు పరిశీలనలో వుంది. అధిష్ఠానం వద్ద గణనీయమైన పలుకుబడి వున్న కారణంగానే ఆయన ప్రకాశం జిల్లావాసి అయినా చిత్తూరు ఎంపీ టికెట్ తెచ్చుకున్నారని, దానికి తోడు ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల విజయానికి వీలైన మేరకు ఆర్థికంగా సహకరించారని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఉన్నత విద్యావంతుడు కావడం, అఖిల భారత సర్వీసుల అధికారిగా పనిచేసిన నేపథ్యం,అధిష్ఠానం వద్ద పలుకుబడి ఆయనకు అదనపు అర్హత కాగలదని సమాచారం.

రాష్ట్ర మంత్రులుగా ప్రచారంలో ఇద్దరి పేర్లు

తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ఎవరికి మంత్రి పదవులు లభిస్తాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలు, నెల్లూరు నుంచీ కొత్తగా తిరుపతి పరిధిలోకి చేరిన మూడు స్థానాలూ కలిపి మొత్తం 17 స్థానాలకు గానూ 15 చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచిన సంగతి తెలిసిందే. అందులో ఒకరు జనసేన కాగా మిగిలిన వారు టీడీపీకి చెందినవారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన మంత్రి పదవులకు ఇద్దరి పేర్లు ప్రచారంలో వున్నాయి. చిత్తూరు జిల్లా నుంచీ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అన్నమయ్య జిల్లా నుంచీ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అమరనాథరెడ్డి విషయానికి వస్తే కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వుండడం, డీసీసీబీ ఛైర్మన్‌గా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు ఉమ్మడి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగానూ, మంత్రిగానూ పనిచేసిన అనుభవం ఆయనకు అర్హతలని చెబుతున్నాయి. జిల్లాలో నాయకులను సమన్వయం చేసుకుని పార్టీని ముందుకు నడిపించిన నేతగా ఆయనకు అధిష్ఠానం వద్ద ప్రత్యేక గుర్తింపు వుంది. దానికి తోడు స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పంలో అధికార పార్టీ వర్గాల ఆగడాలను ఎదుర్కొనడం, నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహణలో రాయలసీమవ్యాప్తంగా కీలక బాధ్యతలు నిర్వర్తించడం, ఆ క్రమంలో 24 పోలీసు కేసులను ఎదుర్కొనడం ఆయనకు కలసివస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుటుంబానికి సైతం సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వున్న సంగతి తెలిసిందే. తండ్రి మంత్రిగా, అన్న సీఎంగా పనిచేసి వుండడంతో పాటు కిషోర్ గత టీడీపీ ప్రభుత్వంలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి పదవితో అధిష్ఠానం ఆయనకు ప్రత్యేక గుర్తింపు కల్పించింది. పుంగనూరు సెగ్మెంట్‌లో వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోవడంతో పాటు తంబళ్ళపల్లి, మదనపల్లె నియోజకవర్గాల్లో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేశారన్న పేరుంది. చంద్రబాబుపై కురబలకోటలో వైసీపీ దాడుల ఘటనకు సంబంధించి కిషోర్ పోలీసు కేసులు కూడా ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ మించి రాజంపేట పార్లమెంటు పరిధిలో మొత్తం ఏడు స్థానాలకు గానూ వైసీపీ మూడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎంపీ సీటు గెలిచి బలంగా ఉనికి చాటుకుంది. అక్కడ టీడీపీ రెండు సీట్లకు, జనసేన ఒక సీటుకు పరి

వి ం త వ ం య్యా ం ం.

అలాంటి చోట పార్టీని బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్ళడానికి కిషోర్ సేవలు అవసరమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సామాజికవర్గాలవారీగా అవకాశాలపై ఆశలు

సామాజిక సమీకరణలు, కూటమి పార్టీల సమీకరణల దృష్ట్యా పలువురు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. మదనపల్లె నుంచీ టీడీపీ తరపున గెలిచిన షాజహాన్ బాషాకు ముస్లిం మైనారిటీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని ముస్లిం మైనారిటీ వర్గాలు ఆశిస్తున్నాయి.తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రాయలసీమ మొత్తం మీద జనసేన తరపున బలిజ సామాజిక వర్గం నుంచీ గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కావడంతో ఆయనకు మంత్రి పదవి గ్యారంటీ అని ఆ సామాజికవర్గం గట్టి నమ్మకంతో వుంది. ఆ మేరకు ఆయన కూడా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ నేపథ్యం, ఆయన తండ్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అధినేత చంద్రబాబుకు సన్నిహిత మిత్రుడు కావడం వంటి కారణాలతో తిరుపతి జిల్లా నుంచీ ఆయనకు అవకాశం వుంటుందని అక్కడి పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఇక చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడైన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌కు ఛాన్సు దక్కుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.టీడీపీకి కంట్లో నలుసుగా మారిన మాజీ మంత్రి రోజాను భారీ మెజారిటీతో ఓడించిన భానుకు మంత్రి పదవి తప్పక దక్కుతుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ఇక తిరుపతి జిల్లాలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ గురించి చెప్పక్కర్లేదు.చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చం ద్రగిరిలో పాతికేళ్ళ తర్వాత రికార్డు మెజారిటీతో గెలిచిన నానీకి అధినేత వద్ద,యువనేత లోకేశ్ వద్ద ప్రత్యేక గుర్తిం పు వుంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీని ఎదుర్కొని, పార్టీని బలోపేతం చేసే క్రమంలో అనేక ఇబ్బందులకు గురైన నానీకి మంత్రి పదవితో అధిష్ఠానం న్యాయం చేస్తుందని చంద్రగిరి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సీనియర్ నేత కావడంతో పాటు వియ్యంకుడైన పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడు కావడం వల్ల అవకాశాల్లేకపోలేదని అనుచరవర్గం ఆశాభావంతో వుంది. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడిని ఓడించడం అదనపు అర్హతగా భావిస్తోంది.

ఎస్సీ సామాజిక వర్గం నుంచీ...

వైద్యరంగంలో ప్రముఖుడు కావడం, అధినేత చంద్రబాబుతో సన్నిహితత్వం వుండడం,మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తెను ఓడించడం వంటి కారణాలతో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్‌కు ఎస్సీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని స్థానిక పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఎస్సీ మహిళ కోటాలో వైద్యురాలైన సూళ్ళూరుపేట యువ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి మంత్రివర్గంలో చోటుదక్కే అవకాశాల్లేకపోలేదని అక్కడి పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. తండ్రి గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసి వుండడం ఆమెకు అనుకూలిస్తుందని చెబుతున్నాయి. అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సీనియారిటీ కారణంగా ఎస్సీ కోటాలో ఛాన్సుంటుందని ఆయన అనుచరవర్గం నమ్ముతోంది. వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని సవాల్ చేసిన నేతగా పేరుతెచ్చుకోవడంతో పాటు సత్యవేడులో సంచలన విజయం సాధించిన కోనేటి ఆదిమూలం మంత్రి పదవికి అర్హుడని అక్కడి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇలా మంత్రి పదవుల కోసం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో విస్తృతస్థాయిలో జనం మధ్య చర్చ నడుస్తోంది. రానున్న ఒకటి రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

సురేష్ పిళ్లై నవలకు రెడ్డెమ్మ పురస్కారం

● 12న చిత్తూరులో బహుమతుల కార్యక్రమం


కేఏ మునిసురేష్ పిళ్లై

చిత్తూరు కల్చరల్, జూన్ 7: చిత్తూరు నగరంలోని రాజామహల్ హోటల్‌లో ఈనెల 12న కుప్పం రెడ్డెమ్మ జాతీయస్థాయి సాహితి పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రామలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోహిణి పంజారి రచించిన 'నల్లసూరీడు', డాక్టర్ ఎం.సుగుణరావు రచించిన 'సుగుణ కథాభిరామం' కథలు బహుతులకు ఎంపికయ్యాయని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తికి చెందిన రచయిత కె.ఎ.మునిసురేష్ పిళ్ళై రచించిన 'పత్రిక శత్రు', సి.కాశీపురం ప్రభాకర్ రెడ్డి రచించిన 'మేడం' నవలకు బహుమతులు లభించినట్లు వివరించారు.

చంద్రబాబు, లోకేశ్‌తో మాట్లాడించాలని.. సెల్ టవర్ ఎక్కాడు

యాదమరి,జూన్7: మద్యం మత్తులో వృద్ధుడు సెల్‌టవర్ ఎక్కాడు. పోలీసుల వివరాల మేరకు.. యాదమరి మండల పరిధిలోని కోణాపల్లెకు చెందిన మనోహర్ నాయుడు(65) మద్యం తాగి ఆ మత్తులో గ్రామశివారులో ఉన్న సెల్‌టవర్ ఎక్కాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌ఐ రామాంజనేయులు అక్కడికి చేరుకుని కిందకు దిగమని కోరగా చంద్రబాబు, లోకేశ్‌తో మాట్లాడిస్తే కిందకు దిగుతానని చెప్పాడు.చంద్రబాబు జిల్లాకు వచ్చినప్పుడు మాట్లాడిస్తామని ఎస్‌ఐ చెప్పడంతో ఆయన కిందకు దిగాడు.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

ముఖేష్ కుమార్ మీనా



తిరుమల, జూన్6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉద యం దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించామన్నారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో చోరీ

పూతలపట్టు, జూన్ 7: మండలంలోని కమ్మగుట్టపల్లి గ్రామ సమీపంలో గల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి మూడు వెండి కిరీటాలు, వెండి వక్షస్థలం, నాలుగు హస్తాలు, పాదాలు, కలశ చెంబు, గంధపు గిన్నె, అష్టలక్ష్మి చెంబుతో కలిపి 15 వెండి ఆభరణాలు చోరీ చేశారు. వీటి విలువ రూ.25 లక్షలు ఉంటుందని గ్రామస్తులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హుండీని పగులగొట్టి నగదు తీసుకెళ్లారు. చిత్తూరు టౌన్ డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో వెళ్లి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సహనం కోల్పోకండి

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలంటూ తిరుపతి పోలీసుల విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7 : ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరువాత కొన్ని ప్రాంతాల్లో వర్గ వైషమ్యాలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకర మైనప్పటికీ ప్రజలెవరూ సహనం కోల్పోకూడదని ఎస్పీ హర్షవర్ధనరాజు ఓప్రకటనలో విజ్ఞప్తి చేశారు.అనవసరంగా ఆవేశాలకు లోనై హింస చెలరేగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదన్నారు.చట్ట పరిధిలో అందరూ సమానమనే విషయం మరిచిపోకూడదన్నారు. రౌడీయిజం, దౌర్జన్యం ఎవ్వరు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎప్పటిలాగే ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

నగరిలో టీడీపీ జైత్రయాత్ర

రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాల్లోనూ పూర్తి ఆధిక్యత ● చారిత్రాత్మక ఓటమి మూటగట్టుకున్న రోజా

పుత్తూరు అర్బన్/నగరి, జూన్ 7: అశ్వమేధ యాగంలో యాగాశ్వం అడుగు పెట్టిన చోటల్లా ఆ రాజ్యం వశమైనట్లు నగరి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అంతకుమించి జైత్రయాత్రను సాగించింది. నియోజకవర్గ పరిధిలోని రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాల్లోనూ పూర్తిస్థాయి ఆధిక్యతతో క్లీన్ స్వీప్ చేసింది. వైసీపీ కంచుకోటలను బద్దలు కొట్టింది. దీంతో రెండు దఫాలు అత్తెసరు మెజార్టీతో గెలిచిన వైసీపీ అభ్యర్థి రోజా.. ఈఎన్నికల్లో భారీ ఓటమిని మూటకట్టుకున్నారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ అప్రతిహత విజయాన్ని సొంతం చేసుకున్నారు.

తొలి రౌండ్ నుంచే మొదలు

టీడీపీ జైత్రయాత్ర తొలి రౌండ్ అయిన వడమాలపేట నుంచే మొదలైంది. గత రెండు ఎన్నికల్లో వడమాలపేట ఇచ్చిన మెజార్టీతోనే వైసీపీ గెలుపొందింది. అలాంటి కంచుకోటలో ఇప్పుడు టీడీపీకి 6165 ఓట్ల మెజార్టీ లభించింది. దీంతో టీడీపీ గెలుపు ఖాయమనే అంచనా బలపడింది. ఈ ఐదేళ్లలో వడమాలపేటలో జరిగిన భూ ఆక్రమణలు ఎన్నడూ జరగలేదనే ప్రచారం ఉంది. దీంతో వైసీపీ అభిమానులు కూడా ఈ దఫా టీడీపీకి పట్టం కట్టారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పుత్తూరు మున్సిపాలిటీ సాధారణంగా టీడీపీకి అనుకూలం. ఈసారి అనూహ్యంగా 12,827 ఓట్ల మెజార్టీని సాధించింది. వైసీపీ దాడులు, దౌర్జన్యాలు, పోలీసు కేసులతో విసిగిపోయిన పట్టణ ఓటర్లు టీడీపీకి ఏకపక్ష విజయాన్ని కట్టబెట్టారనే మాటలు వినబడుతున్నాయి. అలాగే, వైసీపీకి కంచుకోట అయిన పుత్తూరు మండలంలోన టీడీపీకి 3,203 ఓట్ల ఆధిక్యత లభించింది. నగరి మున్సిపాలిటీ ఈ దఫా కూడా టీడీపీకి అండగా నిలిచింది. మెజార్టీ మాత్రం ఏకంగా 11,928కి ఎగబాకింది. నగరి రూరల్‌లోనూ 2,954 ఓట్ల మెజార్టీ లభించింది. హోరాహోరీగా ఉండే నిండ్ర మండలంలో ఈసారి 3,689 ఓట్ల మెజార్టీ వచ్చింది. టీడీపీకి అనుకూలంగా ఉండే విజయపురం మండలం.. ఈ దఫా 3,099 ఓట్ల మెజార్టీని ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్లలోనూ 1,139 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇలా ప్రతి రౌండ్‌లోనూ మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ 45,004 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు.

కకావికలమైన వైసీపీ...

నగరి నియోజకవర్గంలో టీడీపీ జోరుతో వైసీపీ కకావికలమైంది. అన్ని మండలాలు, మున్సిపాలిటీలను టీడీపీ క్లీన్ స్వీప్ చేస్తుండటంతో కౌంటింగ్ కేంద్రంలో వైసీపీ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయింది. రోజా భర్త సెల్వమణి సొంత సామాజికవర్గమైన మొదలియార్ బెల్ట్‌ను టీడీపీ క్లీన్ స్వీప్ చేసింది. పుత్తూరులోని గేటు పుత్తూరు, నగరి మున్సిపాలిటీలోని సత్రవాడ, కేవీఆర్ పేట, పుదుపేట, ఏకాంబరకుప్పంలో మొదలియార్ సామాజిక వర్గం ఏకపక్షంగా టీడీపీ వైపు మొగ్గుచూపింది. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో సరాసరి ఐదు, ఆరు వందల మెజార్టీ టీడీపీ సాధించింది. రూరల్, అర్బన్ అనే తేడా లేకుండా ఓటర్లు ఏకపక్షంగా టీడీపీకి అనుకూలంగా తీర్పునిచ్చారు. ఈ ఐదేళ్ల పాలనలో నగరి నియోజవకర్గంలో జరిగిన విధ్వంసాలు, దౌర్జన్యాలు, భూఆక్రమణలు, సెటిల్‌మెంట్లు, పోలీసు కేసులతో విసిగిన నియోజకవర్గ వాసులు వైసీపీని చీదరించుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో రాష్ట్ర మంత్రి హోదాలో బరిలోకి దిగిన రోజాకు గతంలో ఎవరికీ దక్కనంత భారీ ఓటమి పొందారు.

రాజీనామా చేసి వెళ్లండి

ఎస్వీయూ వీసీకి తెలుగు యువత విజ్ఞప్తి


ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 7: 'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన మీరు పదవికి రాజీనామా చేసి వెళ్లండి' అంటూ ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి తెలుగు యువత నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు, నాయకులు రామ్మోహన్, కృష్ణమూర్తి తదితరులు శుక్రవారం వీసీ చాంబర్‌కు వెళ్లి పదవికి రాజీనామా చేయాలంటూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీసీగా వచ్చిన రాజేంద్ర ప్రసాద్‌ను గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా అవమానించి.. పంపారని గుర్తుచేశారు. అలాంటి పని చేయబోమని, తమకు సంస్కారం ఉందని చెప్పారు. అందువల్ల పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఇక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసినట్టు తమ వద్ద వాయిస్ మెసేజ్‌లు ఉన్నాయని, గత వీసీ రాజేంద్రప్రసాద్ పదవి నుంచి పంపడంలో మీప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. తనకు తెలిసిన ఓ టీడీపీ ఎమ్మెల్యేతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటానని వీసీ చెప్పగా, తెలుగు యువత నాయకులు ససేమిరా అన్నారు. దీంతో తీవ్ర వాగ్వాదం జరగడంతో సెక్యూరిటీ సిబ్బంది ఇటు వీసీని, అటు నాయకులకు సర్దిజెప్పారు. ఈ క్రమంలో వీసీ తన చాంబర్ నుంచి వెళ్లిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పదవులు పొందినవారు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ఆనంద్‌గౌడ్ సూచించారు. లేకుంటే తామే పదవుల నుంచి సాగనంపుతామని స్పష్టం చేశారు. కాగా, టీడీపీ, తెలుగు యువత నాయకుల ఆందోళనతో ఎస్వీయూ వీసీ బంగ్లా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్యాంకులో అప్పు ఉందని పింఛను ఇవ్వలేదు

● వృద్ధురాలి ఆవేదన


పింఛను కోసం బ్యాంకు దగ్గర వేచి ఉన్న వృద్ధురాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 7: బ్యాంకులో అప్పు ఉందని బ్యాంకు అధికారులు తనకు పింఛన్ ఇవ్వలేదని వృద్ధురాలు వజ్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె బ్యాంకు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. తన పేరుతో ఉన్న భూమిపై తన ఇద్దరు కుమారులు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నారని తెలిపారు. వారు లోన్ చెల్లించనందున ప్రభుత్వం తనకు మంజూరు చేసిన పింఛన్‌ను బ్యాంకు అధికారులు ఇవ్వలేదన్నారు. తన కుమారులు చూడకపోవడంతో తాను పింఛన్ డబ్బులతో జీవితం గడుపుతున్నట్లు తెలిపారు. అధికారులు తనకు పింఛన్ ఇప్పించాలని ఆమె కోరుతున్నారు. బ్యాంకు అధికారులు వృద్ధుల పింఛన్ నగదును బాకీ పేరుతో నిలుపుదల చేయడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఖండించారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న టీడీపీ

● పోలీసులకు ఇసుక ట్రాక్టర్ల అప్పగింత


టీడీపీ నాయకులు ఆపేసిన ఇసుక ట్రాక్టర్

ఏర్పేడు, జూన్ 7: ఏర్పేడు మండలం మునగలపాళెం, వికృతమాల సరిహద్దులో శుక్రవారం ఉదయం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కొంతమంది అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక టీడీపీ నేతలు సతీష్ నాయుడు, జనార్దన్, హేమాక్షి తదితరులు స్వర్ణముఖి ప్రాంతానికి వెళ్లి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ క్రమంలో రెండు ట్రాక్టర్లు తప్పించుకున్నాయి. మిగిలిన ఒక ట్రాక్టరును అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. వికృతమాల గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు ఇసుక తరలించడంతో ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత సతీష్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్న వారంతా ఇక ఇసుక అక్రమ రవాణాకు స్వస్తి చెప్పాలన్నారు. ఇకపై టీడీపీ ప్రభుత్వం సహించదని హెచ్చరించారు.

ఏపీకి స్వర్ణయుగం మొదలైంది

నటుడు శివాజి



తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'స్వామిని చూస్తే కళకళలాడుతున్నారు. ఇంతకుముందు తేడాగా ఉన్నారు. స్వామి దగ్గర డ్రామాలు దొబ్బితే ఎవరికైనా ఇదే శిక్ష' అని సినీనటుడు శివాజీ వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి స్వర్ణయుగం మొదలైందని, ఇది స్వామి నిర్ణయమన్నారు.అమరావతి, పోలవరం ఏపీకి లక్ష్యాలని, స్వామి దగ్గర మాట ఇచ్చినోళ్లకి ఎటువంటి పాఠాలు నేర్పించాడో అందరూ చూశారన్నారు.చంద్రబాబు నాయకత్వాన టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో ఏపీ అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. 'మీరు తిట్టినా కొట్టినా తిరిగి కర్మ మీ చుట్టూ తిరిగింది. మిమల్ని ప్రజలు తిడుతున్నారు, కొడుతున్నారు. అవసరమా' అని వైసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎవరైనా ప్రజలను ఇబ్బంది పెట్టకూడదన్నారు. కాగా, బాలీవుడ్ నిర్మాత ఏక్తాకపూర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ద్రావిడ వర్సిటీలో టీడీపీ విజయోత్సవాలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలను వేస్తున్న టీడీపీ శ్రేణులు, అగరం క్రాస్‌లో విజయోత్సవ సంబరాలు

గుడుపల్లె, జూన్ 7: ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ద్రావిడ విశ్వవిద్యాలయంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రధాన గేటు ఎదుట రోడ్డుపై టపాకాయలు పేల్చారు. అనంతరం వర్సిటీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలహారాలు వేశారు. అనంతరం కుప్పం టీడీపీ ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నం, టీడీపీ విస్తరణ విభాగం నేత డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ...ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయన్నారు. విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చేశారని వాపోయారు. కోర్సులను తీసివేసి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తున్నారని చెప్పారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. వారందరికి జీతాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఆ తరువాత కేకక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, గోపినాథ్, సత్యేంద్రశేఖర్, వీజీ ప్రతాప్, హేమాంబర్ గౌడ్, బేటప్పనాయుడు, గోపాల్, అమీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అగరం పంచాయతీలో టీడీపీ శ్రేణులు విజయోత్సాహం చేసుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. కేకులు, మిఠాయిలు అందరికీ పంచిపెట్టారు. కుప్పం టీడీపీ ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నం, టీడీపీ నేతలు డాక్టర్ సురేష్ బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు బాబు నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ హేమాంబర్ గౌడ్‌డాక్టర్ వెంకటేష్, గోపినాథ్, సత్యేంద్రశేఖర్, వీజీ ప్రతాప్, బేటప్ప నాయుడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, సుబ్బు, అనుసూయ, పద్మమ్మ, గోపాల్, రామచంద్ర, నారాయణ, పాపన్న, ప్రకాష్, రమేష్, వెంకటేష్, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మంచి ఫలితాలు : టీడీపీ



టీడీపీ నేతలను సన్మానిస్తున్న కురబ కులస్తులు, కార్యకర్తలు, తనను కలిసిన టీడీపీ శ్రేణులతో ప్రేమ్‌కుమార్

శాంతిపురం, జూన్ 6 : కార్యకర్తలు, నాయకులు, ప్రజల సహకారంతోనే ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించగలిగామని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో జరిగిన విజయోత్సవ సంబరాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడును, ఇతర మండల నేతలను చెంగుబల్ల పంచాయతీ శివకురుబూరు గ్రామానికి చెందిన మండల టీడీపీ కురబ కుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కుల సంఘం నేతలు, అలాగే నడింపల్లె పంచాయతీ సర్పంచ్ బాలకృష్ణ, మఠం పంచాయతీ ఎం.శాంతంపల్లెకు చెందిన కార్యకర్తలు జీవి జయారెడ్డి, సరిత, బాబు, వెంకటరమణ, రమేష్, సోమశేఖర్‌రెడ్డి, మంజునాథ్‌లు వారిని ఘనంగా సన్మానించారు. చంద్రబాబుకు శాంతిపురం మండలం నుంచి 6800 ఓట్లు మెజారిటీ తీసుకు వచ్చిన కార్యకర్తలకు, నాయకులకు శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మణి, నాగరాజు, నారాయణరెడ్డి, పివి నాగరాజు, గోపాల్, మురళీ, అనుసూయ, చలపతి, రమేష్, ఆనందనాయుడు, శ్యామల, రూప, భాస్కర్ పాల్గొన్నారు.

కుప్పం : అధినేత చంద్రబాబుకు ఘన విజయాన్ని అందించిన కుప్పం మండల ప్రజలకు టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కొందరు శనివారం మల్లానూరులోని ఆయన నివాసంలో కలిశారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కుప్పం మండలంలో 13,160 ఓట్ల మెజారిటీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పారు.

పెద్దపంజాణి ఎస్‌ఐపై అవినీతి మరకలు

కరుడుగట్టిన వైసీపీ కార్యకర్తగా విమర్శ



ఎస్ఐ శ్రీనివాసులు

పెద్దపంజాణి, జూన్ 7: వీఆర్‌కు వెళ్ళిన పెద్దపంజాణి ఎస్‌ఐ శ్రీనివాసులుపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ మండల నాయకుడి కనుసన్నల్లో ఉంటూ పార్టీ కండువా వేయని కార్యకర్తలా పని చేశారని విమర్శలున్నాయి. ఇష్టారాజ్యంగా కేసులు బనాయిస్తూ సామాన్య ప్రజలను సైతం తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని పేర్కొంటున్నారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి సొంత పంచాయతీలో సైతం వైసీపీ నాయకుల తప్పుడు ఫిర్యాదుతో విచారణ లేకుండా టీడీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపిస్తున్నారు. మండలంలోని మద్దలకుంట గ్రామానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త పాడిఆవుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను ప్రతి శుక్రవారం పలమనేరు, వుంగళి, బుధవారాలలో పుంగనూరు పశువుల సంతలలో పాడి ఆవులను కొనుగోలు చేసి వాటిని విక్రయించి కుటుంబ పోషణ చేసుకునేవాడు. నెలరోజులక్రితం పలమనేరు నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గమధ్యలో ఆపి తన వద్దనున్న రూ.26200 లాక్కుని స్టేషన్‌కు తీసుకువచ్చి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడని కేసు బనాయించాడని, తన మొబైల్ ఫోన్ లాక్కుని ఫోన్‌పే ద్వారా రూ.10వేలు ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నాడని బాదితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదేంటని అడిగిన తనను, తన భార్య జయమ్మను చితకబాది తనను మదనపల్లె సబ్‌జైలుకు తరలించాడని పేర్కొన్నాడు. ద్విచక్రవాహనాన్ని సైతం కేసులో ఇరికించాడని పేర్కొన్నాడు. ఈ విషయం మరెక్కడైనా చెబితే మరిన్ని కేసులు బనాయిస్తానని బెదిరించడంతో మిన్నకుండిపోయానని వాపోతున్నాడు. అదేవిధంగా కరసనపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శివరాజ్ స్వగ్రామం నుంచి జనవరి 25న పుంగనూరు వెళుతుండగా మార్గ మధ్యలో ద్విచక్ర వాహనం ఆపి స్టేషన్‌కు రావాలని పిలిచి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నావనే ఆరోపణలు చేసి అక్రమ కేసు బనాయించాడు. దీంతోపాటు తన ఫోన్ లాక్కుని ఫోన్‌పేలో ఉన్న రూ.32000 సుబ్రమణ్యంరెడ్డి అనే వ్యక్తి అకౌంటుకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నాడని బాధితుడు పేర్కొ న్నాడు. తన ద్విచక్రవాహనాన్ని కేసులో ఇరికించి రెండు మొబైల్‌ఫోన్లు లాక్కున్నాడని ఆరోపించాడు. అదే విదంగా చలమంగళం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి తన ఇంటి వద్ద భూ సమస్యపై ఫిర్యాదు చేయగా పలమనేరు లోని వైసీపీ కార్యాలయానికి వెళ్ళి పార్టీ కండువా కప్పుకుని ఎమ్మెల్యే దగ్గరనుంచి ఫోన్ చేసివ్వు తరువాత సమస్యపై స్పందిస్తానని పేర్కొన్నట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పత్రికలలో కూడా వార్త ప్రచురిత మైనా స్పందన కరువైంది. మండలంలో ఎస్ఐ శ్రీనివాసులుపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఉన్నతాధికారులు విచారణ చేపడితే మరిన్ని అవినీతి ఆరోపణలు వెలుగు చూస్తాయని స్థానికులు అంటున్నారు.

మార్కెట్ యార్డులో అక్రమ పార్కింగ్



బెల్లం గోడౌన్ ముందు , టమోటా మండీల ముందు పార్కింగ్ చేసిన లారీలు

పలమనేరు, జూన్7 : స్థానిక లారీ యజమానులు కొందరికి పలమనేరు మార్కెట్ యార్డు పార్కింగ్ స్థలంగా మారింది. ఆటోనగర్‌లో ఉంచుకోవాల్సిన లారీలను మార్కెట్ యార్డులో ఉంచుతున్నారు. మార్కెట్ యార్డులోని గోడౌన్ల ముందు, మరికొందరు టమోటా మండీ ల ముందు నిలిపి వేస్తున్నారు. దీంతో మార్కెట్ యార్డుకు టమోటాలు, బీన్సు, క్యాబేజి, వంకాయలు, బీరకాయలు తదితర వాటితో వచ్చే ఆటోలు, మినిలారీలు, ట్రాక్టర్లకు ఇబ్బందిగా మారుతోంది. దీనిపై నెల్లిపట్ల ప్రాంతానికి చెందిన టమోటారైతు గోపినాయుడు శుక్రవారం మార్కెట్ యార్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులుగా చెలామణి అయిన కొందరు లారీ యజమానులు వారి లారీలను మార్కెట్‌యార్డులో నిలుపుకొంటూ పార్కింగ్ స్థలంగా మార్చివేశారని, అధికారులు స్పందించి మార్కెట్‌యార్డులో అక్రమ పార్కింగ్‌లు లేకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు మనోహరరెడ్డి

పలమనేరు, జూన్7 : పెన్షనర్ల సమస్యలను నూతన ప్రభుత్వం సానుభూతితో పరిష్కరించాలని పలమనేరు పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మనోహరరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పలమనేరు పెన్షనర్ల సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. కొత్తగా సంఘంలో చేరిన సభ్యులు గుర్తింపు కార్డులు పొందాలని ఉపాధ్యక్షులు గురుమూర్తి కోరారు. ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ సంఘ భవన విస్తరణకు నూతన ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ట్రెజరీ అధికారులు పెన్షనర్లకు సంబంధించి తప్పుగా నమోదైన వివరాలను సరిదిద్దాలని జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి కోరారు. ఈ సమావేశంలో సభ్యులు దవనముని, విజయకుమార్‌రెడ్డి, విజయకుమార్, శేఖర్, జగదీశ్వర్, గోవిందరాజులు, నాగభూషణం, సాపయ్య, రాజారెడ్డి, జయపాల్ , సూర్యనారాయణరెడ్డి, పురుషోత్తం, రాజన్న, హాజీ సాహెబ్, వేణుగోపాల్, సిద్దమనోహర్, మురళీధరపిళ్లై, కస్తూరి, పాండురంగయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గెలుపుతో టీడీపీ శ్రేణుల్లో జోష్
ఓటమితో డీలాపడ్డ వైసీపీ

వి.కోట, జూన్ 7: టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో టీడీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్ కనిపిస్తోంది. ఐదేళ్ళుగా వైసీపీ ఆడగాలతో ఇబ్బందులు పడ్డ టీడీపీ కేడర్ తమ పార్టీ అధికారంలోకి రావడంతో ఉత్సాహంగా ఉన్నారు. ఫలితాల రోజు నుంచి నిత్యం సంబరాలు జరుపుకొంటున్నారు. వి.కోట మండలంలో 70649 ఓట్లున్నాయి. అందులో 60490 ఓట్లు పోలై 85.6 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డికి 30992 ఓట్లు, వైసీపీ అభ్యర్థికి 27521 ఓట్లు వచ్చి టీడీపీ 3471 ఓట్ల మెజారిటీ సాధించింది. 2019 ఎన్నికల్లో వైసీపీకి వి.కోట నుంచి 5 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీ రాగా, ఈసారి ఎన్నికల్లో టీడీపీకి 3471 ఓట్ల మెజారిటీ వచ్చింది. తోటకనుమ, నెర్నిపల్లె, పెద్దబరిణేపల్లె, యాలకల్లు, ముదరందొడ్డి, చింత మాకులపల్లె పంచాయతీల్లో వైసీపీ ఆధిక్యాన్ని కనబరచగా మిగిలిన పంచాయతీల్లో టీడీపీ ఎదురు లేకుండా నిలిచింది. ఈసారి వి.కోటలో పదివేలకుపైగా మెజారిటీ సాధిస్తామన్న నమ్మకంతో ఉన్న వైసీపీకి ప్రజలు నుంచి చీత్కారాలు ఎదురవ్వడంతో ఆ పార్టీ శ్రేణులు ఖంగుతిన్నారు ఇన్నాళ్ళు అధికారం చెలాయించిన వైసీపీ కేడర్ ఘోర పరాభవంతో జీర్ణించుకోలేక పోతున్నారు. ముఖ్యనాయకులు ఇప్పటికే పలాయనం చిత్తగించగా మిగిలిన నేతలు సైలెంట్ అయ్యారు. మొత్తానికి వికోట తిరిగి పట్టునిలుపుకుని టీడీపీకి కంచుకోటలా నిలవడం పట్ల పార్టీ నాయకులు జోష్‌గా కనిపిస్తున్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, జూన్ 7 : బైరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో ఆదివారం మానస క్లినిక్, షణ్ముబేకరి సంయుక్త ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటివైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తెలిపారు. కంటి సమస్యతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు రూరల్, జూన్ 7: పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రవేశానికి విద్యారులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీకాం/సీఏ, బీఎస్‌సీ, బీఏ తదితర కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు రూరల్, జూన్7: పుంగనూరు పాత బస్టాండ్ వద్ద వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని ఉదయాన్నే శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి రాహుకాల పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళా భక్తులు ఉపవాసాలతో అమ్మవారికి దీపారాధన చేసి చీరలు, రవికలతో మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రామకుప్పం, జూన్ 7: రామకుప్పంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతులకు సంబంధించి మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10తేదీలోగా పాఠశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని ఆయన కోరారు. అదేవిధంగా స్టడీ సర్టిఫికెట్‌తోపాటు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డుల నకలు అందజేయాలన్నారు. 7వ తరగతిలో స్టేట్ సిలబస్, 8, 9 తరగతుల్లో సెంట్రల్ సిలబస్ ఉంటుందని తెలిపారు.

మండలి బుద్ధప్రసాద్‌కు సన్మానం



పలమనేరు, జూన్7 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన తెలుగు భాషాభిమాని మండలి బుద్ధప్రసాద్‌ను శుక్రవారం పలమనేరు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి. తులసినాథంనాయుడు, పుష్ప దంపతులు ఘనంగా సన్మానించారు. మండలి బుద్ధప్రసాద్‌కు శాలువాకప్పి, తలపాగా వుంచి, పూలమాల వేసి జ్ఞాపికను అందజేశారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, జూన్7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో చంద్రమౌళి భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, జూన్7: పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బలిపోతుకు పూజలు

సోమల, జూన్ 7: సోమలలో గంగమ్మ జాతర చాటింపుతో బలిపోతును దిడ్డివారిపల్లె, చెన్నయ్యగారిపల్లెల్లో ఊరేగించారు. ఆసాది వారు అమ్మవారి జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. మహిళలు బలిపోతుకు ఇంటింటా పూజలు జరిపారు. ఈనెల 11వ తేదీన అమ్మవారి ప్రతిమను శివాలయం ఎదుట ప్రతిష్ఠించనున్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయబార ఘట్టం

సోమల, జూన్ 7: ఇరికిపెంట పంచాయతీ భారతం మిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. ఉభయదారులు సీతారామయ్య, శివరాజ కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో పురోహితులు హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భాగవతారణి గీతావాణి శ్రీకృష్ణ రాయబారం కథను భక్తులకు వివరించారు. రాత్రి నాటకప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

సోమల, జూన్ 7: ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామాల్లో ఎలాంటి అలజడులు జరగకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ వెంకట నరసింహులు కోరారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. చిన్నపాటి వివాదాలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సారా విక్రయాలపై సమాచారం తెలుసుకుని వివరాలు అందజేయాలన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు



కల్లూరు, జూన్ 7: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో గురువారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. కల్లూరుకు చెందిన రైతులు సయ్యద్‌బాషా, ఖాదర్ వల్లి, కోటపల్లికి చెందిన గోపి, పురుషోత్తం, దామోదర్‌నాయుడు, మురళి తదితర రైతుల మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. చెట్లలోని మామిడికాయలను నేల రాల్చాయి. మామిడితోట కంచెకు ఏర్పాటుచేసిన రాతికూసాలను ధ్వంసం చేశాయి. మామిడికాయలు కోతలు కోసే సమయంలో ఏనుగులు దాడులు చేయడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని రైతులు వాపోయారు.

రామనపల్లెలో టీడీపీ నేతలకు సన్మానం



బైరెడ్డిపల్లె, జూన్ 7 : టీడీపీ కూటమి విజయం సాధించడంతో మండలంలో టీడీపీనాయకులను కార్యకర్తలు సన్మానించి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం రామనపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్రగుప్తా, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు భువనచంద్రగౌడును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అలాగే బైరెడ్డిపల్లెలో మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మను కూడా పార్టీశ్రేణులు సన్మానించారు.

నీట్‌లో కేజీసీ విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జూన్ 7: నీట్-2024 పరీక్షలో బీసీఎన్ విద్యా సంస్థలకు చెందిన కుప్పం జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఛైర్మన్ బీసీ.నాగరాజ్, కళాశాల ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ తెలిపారు. నిఖిల్ శ్రీనివాసన్ 720 మార్కులకు గాను 605 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించబోతున్నట్లు చెప్పారు. అలాగే ఆర్.రంజిత్ 557 మార్కులు, ఎం.శంకర్ 550 మార్కులతో ఎంబీబీఎస్ సీట్లను సాధించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను వారు అభినందించారు. అలాగే కుప్పంలోని ఐఆర్‌ఎం కళాశాల విద్యార్థిని జీవన నీట్‌లో 720 మార్కులకుగాను 583 మార్కులు సాధించి మెడికల్ సీట్‌కు అర్హత పొందినట్లు కళాశాల ఛైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థినిని ఆయన అభినందించారు.

కల్లూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

కల్లూరు, జూన్ 7: కల్లూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవమైనట్లు జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలి తెలిపారు. కల్లూరు లయన్స్‌క్లబ్ కార్యాలయంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ నూతన కమిటీ పదవులు ఏకగ్రీవమయ్యాయి. కల్లూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పోకల తాతయ్య, కార్యదర్శిగా వెంకటశిద్దులు, కోశాధికారిగా ప్రకాష్, ఉపాధ్యక్షులుగా రాజేంద్ర, ఇషాన్, మీడియా అధ్యక్షులుగా సుదాకర్ నాయుడు, ఫౌండేషన్ సమన్వయకర్తగా రాజారెడ్డి, సేవాకార్యక్రమాల అధ్యక్షుడిగా రాజన్, డైరెక్టర్లుగా లావణ్య, అర్షాద్ బేగం ఎంపికయ్యారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు



కల్లూరు, జూన్ 7: ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారంలోకి రావడంతో పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం దేవళంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 101 టెంకాయలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, నారాయణస్వామినాయుడు, ముద్దుస్వామినాయుడు, రాజేష్‌నాయుడు, పునీత్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతిపురంలో టీడీపీకి 6858 ఓట్ల మెజారిటీ

శాంతిపురం, జూన్ 7 : శాంతిపురం మండలంలో టీడీపీ అభ్యర్థి నారా చంద్రబాబు నాయుడుకు 6858 ఓట్ల మెజారిటీ లభించింది. మండలంలో 52 బూత్‌లు ఉండగా 40 బూత్‌లలో టీడీపీ మెజారిటీ రాగా కేవలం 12 బూత్‌లలో మాత్రమే వైసీపీ అభ్యర్థి భరత్‌కు మెజారిటీ దక్కింది. అందులోను 46వ బూత్ కడపల్లెలో 174 ఓట్లు మెజారిటీ రాగా, 21 చౌడంపల్లె బూత్‌లో 68 ఓట్ల మెజారిటీ వచ్చింది. మిగిలిన 10 బూత్‌లలో 50 ఓట్ల లోపే మెజారిటీ దక్కింది. 2019 ఎన్నికల్లో టీడీపీకి కేవలం 2700 ఓట్లు మెజారిటీ రాగా, అది ఇప్పుడు రెండింతలు పెరిగి 6858 ఓట్ల మెజారిటీ చంద్రబాబుకు పెరిగింది. టీడీపీకి అత్యధిక మెజారిటీ సాధించిన బూత్ మోరసనపల్లె. అందులో టీడీపీ అభ్యర్థికి చంద్రబాబుకు 464 ఓట్ల మెజారిటీ దక్కింది. ఆ పంచాయతీ టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



గాయపడ్డ మంజునాథ్, రెడ్డిశేఖర్

చౌడేపల్లె, జూన్7: వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలైన ఘటనలు చౌడేపల్లె మండలంలో చోటుచేసుకున్నాయి. శుక్రవారం బైరెడ్డిపల్లెకు పంచాయతీ విరుపాక్షపురానికి చెందిన మంజునాథ్ కూరగాయలను తన ద్విచక్రవాహనంలో పుంగనూరు మార్కెట్‌లో విక్రయించి స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో పుదిపట్ల సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డాడు, ఆయనకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో పుంగనూరు ఏరియా అసుపత్రికి తరలించి చికిత్సలు కల్పించారు. అలాగే కొలింపల్లి వద్ద కాగతికి చెందిన రెడ్డిశేఖర్(20) తన ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో ఆతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో పుంగనూరు ఏరియా అసుపత్రికి తరలించి చికిత్సలు కల్పించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గెలిచింది : ఎస్‌డీపీఐ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌డీపీఐ నాయకులు

పుంగనూరు, జూన్7: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ప్రజలు గెలిపించారని ఎస్‌డీపీఐ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరులోని ఆ పార్టీ కార్యాలయంలో పుంగనూరు ఎస్‌డీపీఐ అభ్యర్థి కేఎస్.అన్వర్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, దోపిడీలతో పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పి రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడే పార్టీకి ప్రజలు అధికారం ఇచ్చినట్లు వివరించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వి.కోటలో జోరు వాన



వి.కోట, జూన్ 7: గత మూడు రోజులుగా వి.కోటలో జోరుగా వానలు కురుస్తున్నాయి. రోజు సాయంత్రం మొదలయ్యే వాన క్రమేపీ పుంజుకుని రాత్రంతా కురుస్తోంది. దీంతో ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు వానలతో కాస్త చల్లబడ్డారు. ఖరీఫ్ ప్రారంభం నుండే వానలు కురుస్తుండటంతో రైతులు వేరుసెనగ విత్తేందుకు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి చిరుజల్లుతో మొదలైన వర్షం క్రమేపీ పుంజుకుని కుండపోతగా కురిసింది. వర్షానికి గాలులు తోడవ్వడంతో తోటల్లో మామిడి నేలరాలాయి. వర్షపు నీటితో పట్టణంలోని వీధులనీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారిలో వర్షపునీటి కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రజాతీర్పు చిరస్థాయిగా నిలిచిపోతుంది



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

పెనుమూరు, జూన్ 7: 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు చిరస్థాయిగా నిలిచిపోతుందని టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు పేర్కొన్నారు. కూటమి గెలిచినందుకు మండల నాయకులతో కలిసి శుక్రవారం పెనుమూరు మెయిన్ రోడ్డులో, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. కృష్ణమూర్తినాయుడు, తలారి రెడ్డెప్ప, ఈశ్వర్‌నాయుడు, చిరంజీవి రెడ్డి, భాస్కర్, పసుపులేటి రమేష్, పరమేశ్వరరెడ్డి, సురేష్‌నాయుడు, అశోక్, ఏకాంబరం, గాలి రాజేష్‌రెడ్డి, పూలశేఖర్, రాజేష్ శివశంకర్, శ్రీనివాసచౌదరి, గంగయ్య, బాబు పాల్గొన్నారు.

పశువైద్యుల నిర్లక్ష్యం..రైతులకు శాపం



ఉదయం 10 గంటలైనా తెరుచుకోని పాలసముద్రం పశువైద్యశాల

పాలసముద్రం, జూన్ 7: మండలంలోని పాలసముద్రం, తిరుమలరాజుపురం గ్రామాల్లోని పశువైద్య కేంద్రాల వైద్యుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. చిత్తూరులో కాపురముంటూ వారంలో ఒకట్రెండు సార్లు మాత్రమే విధులకు హాజరవుతున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే గోపాలమిత్రలు, తమిళనాడు వైద్యులకు డబ్బులిచ్చి వైద్యం చేయించాల్సి వస్తోందని వాపోతున్నారు. శుక్రవారం పాలసముద్రం పశువైద్యశాల ఉదయం 10 గంటలైనా తెరుచుకోలేదు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉన్నా అమలు కావడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన

పాలసముద్రం, జూన్ 7: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధిస్తున్నారని, విద్యార్థులను చేర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ హేమలత శుక్రవారం కోరారు. మండలంలోని ఆముదాల, ఎస్.ఆర్.కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పాసైన విద్యార్థులను తమ కళాశాలలో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వినాయకం, సుశీల, రమ్య పాల్గొన్నారు.

జూనియర్ కాలేజ్‌లో అడ్మిషన్ల ప్రారంభం

బంగారుపాళ్యం, జూన్ 7: స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సర ప్రవేశాలను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాఠి తెలిపారు. ఎంపీసీలో 80, బైపీసీలో 80, సీఈసీలో 80, హెచ్ఈసీలో 80, ఈఈటీలో 40, ఏఎన్‌టీ 40, సెరికల్చర్‌లో 40 సీట్లు ఉన్నాయన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో బోధన ఉందని, ఆసక్తిగల విద్యార్థులు సోమవారం నుంచి కళాశాలలో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధే మా అజెండా : టీడీపీ



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

విజయపురం, జూన్ 7: ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే తమ అజెండా అని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. విజయపురంలో శుక్రవారం వారు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డుకుంటామని చెప్పారు. టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, సుధాకర్‌రాజు, కొండూరు దాము, హరికృష్ణ, సమరసింహారెడ్డి, నాదముని పాల్గొన్నారు.

మూడోసారి మోదీ ప్రభుత్వం హర్షణీయం : బీజేపీ



బీజేపీ కార్యాలయం వద్ద సంఘీభావం తెలుపుతున్న పార్టీ శ్రేణులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 7: మూడోసారి మోదీ ప్రధాని కావడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు మాట్లాడుతూ ఇండియా కూటమి ఎన్ని అభాండాలు వేసినా ప్రజలు మోదీ ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ దేశ ప్రగతికి ఎన్డీయే సర్కారు కృషి చేస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దుర్గా రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, నాయకులు గురుగణేష్, షణ్ముగం బ్రహ్మానందరెడ్డి, రవికుమార్, బాబు పాల్గొన్నారు.

చెట్లను నరికిన అధికారులపై చర్యలు



తొలగించిన చెట్లను పరిశీలిస్తున్న జేడీ ఆంజనేయులు

బంగారుపాళ్యం, జూన్ 7: ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాల కోసం బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో చెట్లను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు ఆయన శుక్రవారం విచారణ చేపట్టారు. మార్కెట్ యార్డులో రైతులకు, కూలీలకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఏడీఎం పరమేశ్వర్ ఉన్నారు.

సచివాలయ రంగులు మారుతున్నాయ్!



తెలుపు రంగు వేస్తున్న గ్రామస్తులు

పెనుమూరు, జూన్ 7: మండలంలోని చింతపెంట సచివాలయ భవనానికి ఉన్న వైసీపీ రంగులను అక్కడి నాయకులు, ప్రజలు మార్చారు. వాటి స్థానంలో తెలుపు రంగు వేశారు. ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేయడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎన్నికల కోడ్ సమయంలో కొన్నింటికి రంగులు మార్చారు.

వైసీపీ ప్రచార వాహనానికి నిప్పు



శ్రీరంగరాజపురం, జూన్ 7: వైసీపీ ప్రచార వాహనానికి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట దీపిక కల్యాణ మండపం ఎదురుగా ఉన్న వాహనంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. అదేవిధంగా మూడుచోట్ల వైసీపీ శిలాఫలకాలను ధ్వంసం చేశారు. వైసీపీ నాయకుల ఫిర్యాదు మేరకు కార్వేటినగరం సీఐ సత్యబాబు, ఎస్ఐ కుళాయప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లోకేశ్‌ను కలిసిన భానుప్రకాష్



నగరి జూన్7: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భాను ప్రకాష్ గురువారం ఉండవల్లి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల సరళి, కౌంటింగ్ తీరు గురించి చర్చించుకున్నారు. భాను ప్రకాష్‌ను లోకేశ్ అభినందించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



టిప్పర్లలోకి ఇసుక లోడ్ చేస్తున్న అక్రమార్కులు

నగరి, జూన్7: మండల పరిధిలోని గుండ్రాజుకుప్పం పంచాయతీలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కుశస్థలి నది నుంచి ఇసుకను తీసుకొచ్చి గుండ్రాజుకుప్పం పంచాయతీలో డంప్ చేసి ఉంచారు. అక్కడి నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎక్కువ మొత్తంలో తమిళనాడుకు తరలించి, లాభపడుతున్నట్లు తెలిపారు. పొలాల్లోనూ ఇసుక తరలిస్తున్నారని, అడిగితే సమాధానం చెప్పడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

చంద్రప్రభ వాహనంపై ఇంద్రవరదుడు



యాదమరి, జూన్ 7: ఇంద్ర వరదుని బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించారు. ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. అంతకు మునుపు వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్ర వరదునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించి మేళతాళాలతో ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. 12 రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆగమశాస్త్రం ప్రకారం ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం బలిపీఠం, ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ యాదమరి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయులు కొట్టి, కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి దేవదేవేరులు చంద్రప్రభ వాహనంపై విహరించారు. వాహన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్ర వరదుని ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, వేదపండితులు మురళి, హేమంతాచార్యులు, కృష్ణాచార్యులు పాల్గొన్నారు.

రాక్షస పాలన నుంచి విముక్తి లభించింది : టీడీపీ



జడ్పీ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు

చిత్తూరు రూరల్, జూన్ 7: రాష్ట్ర ప్రజలకు రాక్షస పాలన నుంచి విముక్తి లభించిందని టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ పేర్కొన్నారు. టీడీపీ కూటమి విజయం సాధించడంతో శుక్రవారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ అవినీతి, అక్రమాలకు పెద్దపీట వేశారని విమర్శించారు. అభివృద్ధి జాడ లేకుండా చేశారన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెట్టడమేగాక దాడులు చేశారని తెలిపారు. విసిగిపోయిన ప్రజలు మళ్లీ ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారని అన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, మంజూష్ కుమార్, రఘు, గురేష్, చల్లా, మనోహర్‌నాయుడు, శ్రీకాంత్, ప్రకాష్, గిరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ జిల్లా నేత చంద్రప్రకాష్ జడ్పీ సీఈవో గ్లోరియాను కోరారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ సీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని తెలిపారు.

టీడీపీ నేతలకు సన్మానం



సీఆర్ రాజన్, కోదండయాదవ్‌లను సన్మానిస్తున్న నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 7: టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సీఆర్ రాజన్, కోదండయాదవ్‌లను పార్టీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించిన టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. విజయం సాధించిన ఎంపీ, ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, నేతలు వెంకటేష్ యాదవ్, వరదరాజులు యాదవ్, జయచంద్రనాయుడు, బాబు నాయుడు, కృష్ణమూర్తి, తుకారాం రెడ్డి, రవి యాదవ్, దేవరాజులు నాయుడు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పారు

గంగాధరనెల్లూరు : ఐదేళ్లుగా వైసీపీ చేసిన అరాచకాలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని టీడీపీ జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ విమర్శించారు. కూటమి విజయం సాధించడంతో శుక్రవారం సాయంత్రం చిత్తూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌లను సన్మానం చేశారు. టీడీపీ నేతలు దేవరాజులునాయుడు, తుకారామ్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, వరదరాజులు, రవియాదవ్ పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధికి బాటలు వేస్తా : దగ్గుమళ్ల



ఢిల్లీలో చంద్రబాబుతో దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ, జూన్ 7: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తామని ఎంపీగా ఎన్నికైన దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన పార్లమెంటరీ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే నవ్యాంధ్ర సాధ్యమని, ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.

కొంపముంచిన బెట్టింగ్
రూ.కోటి పోగొట్టుకున్న రియల్టర్

వెదురుకుప్పం, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపోటములపై పెట్టిన బెట్టింగులో పాలసముద్రానికి చెందిన ఓ రియల్టర్ రూ.కోటి పోగొట్టుకున్నాడు. వైసీపీకి చెందిన ఆ రియల్టర్ బెంగళూరులో స్థిరపడ్డాడు. సర్వేల ఆధారంగా ఈసారి కూడా ఏపీలో వైసీపీ గెలిచి, జగన్ మళ్లీ సీఎం అవుతారని బెంగళూరులోని టీడీపీ సానుభూతిపరుడితో రూ.కోటి బెట్టింగ్ కట్టాడు. అయితే ఏపీలో వైసీపీ ఓడిపోవడంతో రూ.కోటి రూపాయలు పోగొట్టుకున్నాడు. అలాగే వెదురుకుప్పం మండలం జక్కిదొన ప్రాంతానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు మళ్లీ జగన్ సీఎం అవుతారని బెంగుళూరులో బెట్టింగ్ కాచి రూ.10లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. పాలసముద్రంలో ఇద్దరు స్థానికంగా రూ.5 లక్షలు, లక్ష వంతున బెట్టింగులో పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం, కార్వేటినగరం మండలం గాదంకిలోనూ బెట్టింగుల్లో పలువురు నష్టపోయినట్లు అక్కడి వారు చెబుతున్నారు.

జీడీనెల్లూరులో క్రాస్ ఓటింగ్

వెదురుకుప్పం, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో గంగాధరనెల్లూరులో చిత్తూరు ఎంపీ (టీడీపీ) అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు 96,883 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్యే అభ్యర్థి థామస్‌కి 99,455 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్యే అభ్యర్థికి పడిన ఓట్ల కంటే ఎంపీ అభ్యర్థికి 2,572 ఓట్లు తక్కువగా వచ్చాయి. అంటే క్రాస్ ఓటింగ్ జరిగింది. ఇక వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి 74,586 ఓట్లు వస్తే ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పకు 75,248 ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా ఎంపీ అభ్యర్థికి 662 ఓట్లు అధికంగా వచ్చాయి. దీన్నిబట్టి చూస్తే వైసీపీ, టీడీపీకి క్రాస్ ఓటింగ్ బెడద తప్పలేదు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో
రూ.12 లక్షల జరిమానా

చిత్తూరు లీగల్, జూన్ 7: నగర పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారి నుంచి రూ.12 లక్షల జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని ప్రిన్సిపల్ సీనియర్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. అలాగే జూన్ 1వ తేదీ నుంచి మారిన ట్రాఫిక్ చట్టాల ప్రకారం శుక్రవారం 20 మంది పట్టుబడ్డారని, వీరిని కోర్టులో హాజరుపరచగా జడ్జి ఉమాదేవి. రూ.10వేలు చొప్పున జరిమానా విధించారని తెలిపారు.

పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం



కార్వేటినగరం, జూన్ 7: స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పనులను శుక్రవారం పునః ప్రారంభించారు. ప్రహరీ గోడ లేకపోవడం వల్ల రాత్రిపూట పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు.

రేపు నామసంకీర్తనపై శిక్షణ

చిత్తూరు కల్చరల్, జూన్ 7: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం నామసంకీర్తన, జ్యోతిధ్యానం అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ఎస్.మధుసూదనం తెలిపారు. నేటి యువతలో ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

గంగాధరనెల్లూరు, జూన్ 7: విజ్ఞానం పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడుతాయని గ్రంథాలయాధికారి గజేంద్రబాబు అన్నారు. వేసవి సందర్భంగా గంగాధరనెల్లూరు గ్రంథాలయంలో వివిధ అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు.

వైభవంగా పుష్పయాగం



కార్వేటినగరం, జూన్ 7: వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం పుష్పయాగం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పలువురు టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు



కల్లూరు, జూన్ 7: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో గురువారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. కల్లూరుకు చెందిన రైతులు సయ్యద్‌బాషా, ఖాదర్‌వల్లి, కోటపల్లికి చెందిన గోపి, పురుషోత్తం, దామోదర్‌నాయుడు, మురళి తదితర రైతుల మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. చెట్లలోని మామిడికాయలను నేలరాల్చాయి. మామిడితోట కంచెకు ఏర్పాటుచేసిన రాతికూసాలను ధ్వంసం చేశాయి. మామిడికాయలు కోతలు కోసే సమయంలో ఏనుగులు దాడులు చేయడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని రైతులు వాపోయారు.



అన్నాస్వామి మొదలియార్ వీధిలో పారుతున్న వర్షపునీరు



ఎంఎస్ఆర్ జంక్షన్ వద్ద వర్షపు నీటి ప్రవాహం

చిత్తూరులో భారీ వర్షం

చిత్తూరులో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాదాపు 40 నిమిషాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొన్నియమ్మగుడి, బజారు, చర్చి, ఓటీకే రోడ్డుల్లో వర్షపు నీరు భారీగా ప్రవహించింది. వాహనదారులు, ప్రజలకు అవస్థలు పడ్డారు.

- చిత్తూరు కల్చరల్